క్లుప్తంగా

వైభవంగా లక్ష బిల్వార్చన



అయ్యప్పస్వామికి లక్ష బిల్వార్చన

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో శేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి 18 కలశాలతో లక్ష బిల్వార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. కేరళ గురుస్వామి సుబ్రహ్మణ్యన్ నంబూద్రి నేతృత్వంలో లక్ష బిల్వార్చన, అయ్యప్ప భక్తిరంజని సతార్ స్వామి భజన బృందం భజనలతో ఆద్యంతం భక్తి పారవశ్యంలో కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్పలు పాల్గొన్నారు.

సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మండపేట: రిటైర్‌మెంట్ అనేది వయసుకే కానీ మనసుకు కాదని, ఏడు పదుల మన అనుభవంలో సమాజానికి దిక్సూచిగా నిలుద్దామని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట పట్టణ, మండల శాఖల నేతలు పేర్కొన్నారు. పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్ నకరా జయంతిని బుధవారం స్థానిక నాళం చిన భీమయ్య సత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పైబడిన ఆరుగురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు నేతృత్వంలో సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సంఘ నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులు, సన్మాన గ్రహీతల బంధువులు పాల్గొన్నారు.

'సహకార' ఎన్నికలు నిర్వహించాలి

కాజులూరు: రైతుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో కుయ్యేరులో ఆయన రైతులతో మాట్లాడుతూ సహకార సంఘాలు, రైతులు పరస్పర సహకారాలతో సంఘాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. అయితే ఇటీవల ఈ సంఘాలకు పాలకవర్గం లేకపోవటంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వం త్రిసభ్య కమిటీల ఏర్పాటు ద్వారా అనుభవం లేని కార్యకర్తలను పాలకవర్గంగా నియమించాలని చూస్తుందని దీని వల్ల సంఘాలు మరింత నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు కురుపూడి భూచక్రం, రైతులు రామచంద్రరావు, తాతారావు, ముసలయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ఆర్థిక సాయం



నాగేశ్వరరావుకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.35 వేల ఆర్థికసాయం బుధవారం అందించారు. మండలంలోని కాపవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న వనుం లక్ష్మి కుటుంబానికి ఆసరాగా రూ.15 వేలను ఆమె భర్త వనుం నాగేశ్వరావుకు అందజేశారు. ఇటీవల కాలంలో కాజులూరు మండలం ఉప్పుమిల్లిలో పిడుగు పడి మృతి చెందిన నందికోళ్ల వీరస్వామి భార్యకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని మంత్రి సుభాష్ అందజేశారు. ఆయన వెంట కూటమి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మండపేట: అనారోగ్యం బారిన పడి వివిధ ఆసుపత్రులలో చికిత్స పొంది ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న పలువురికి సీఎం సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆర్థిక సాయం అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆరుగురికి రూ 3.21 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. వడ్లమూరుకు చెందిన గజ్జరపు మంగాయమ్మకు రూ.35,166, ఏడిదకు చెందిన నామాల మీనాక్షికి రూ.37,378, చింతాకుల వెంకటరమణకు రూ.65,225 అలాగే మాచర గ్రామానికి చెందిన బడుగు పాపకు రూ.77,909, పాలతోడుకు చెందిన టేకిమూడి సత్యనారాయణకు రూ.55,600, మండపేటకు చెందిన గొడితి వీర్రాజుకు రూ.50,000 ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- ఉత్తీర్ణతా శాతం పెంచేలా ప్రణాళిక
- క్లస్టర్ పరిధిలో 94 పాఠశాలలు
- హాజరు కానున్న 5,084 మంది విద్యార్థులు



టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

రాయవరం: పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ పరీక్షల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థి భవిష్యత్తులో టెన్త్ కీలకం. పదో తరగతి ఫలితం పైనే విద్యార్థి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులూ పది పరీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, తమ చిన్నారులు మెరుగైన ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తుంటారు. ఇప్పటికే విద్యాశాఖ అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అలాగే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి, శత శాతం ఫలితాలు సాధించేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

క్లస్టర్ పరిధిలో ఇలా

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 5,084 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో 94 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. మండలాలవారీగా రామచంద్రపురంలో 32, రాయవరంలో 13, కె.గంగవరంలో 10, కపిలేశ్వరపురంలో 11, మండపేటలో 28 పాఠశాలలున్నాయి. వాటిలో 5,034 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని, మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు, 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జరిగిన సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేలా ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు.

విద్యార్థుల దత్తత

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకునే విధంగా ఒక్కో ఉపాధ్యాయుడు ఆరుగురు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నారు. విద్యార్థుల వ్యక్తిగత శ్రద్ధతో పాటుగా వారిలో ఆత్మ విశ్వాసం నింపేందుకు ప్రయత్నిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్వహణ, పాఠ్యాంశాల పునశ్చరణ, వార్షిక పరీక్షల తరహాలో మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ సమయంలో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను పరిశీలించి, అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

మార్చి 17 నుంచి

ఇప్పటికే ప్రభుత్వ పరీక్షల విభాగం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. 2014-25 విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ ప్రకారం పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలను పాఠశాల స్థాయిలో తీసుకుంటున్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి



పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులు సైతం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటి వరకు నిర్వహించిన ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల ఆధారంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తున్నాం.

– ఎ.రాజు, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, అంగర, కపిలేశ్వరపురం మండలం

వంద రోజుల ప్రణాళిక అమలు



వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో జరిగిన పరీక్షల ఫలితాలను పరిశీలిస్తున్నాం. ఏఏ అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో పరిశీలిస్తున్నాం. తరచుగా పాఠశాలలు సందర్శిస్తున్నాం. విద్యార్థుల సందేహాల నివృత్తికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– పత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో, రాయవరం

చెబుతున్నా వినరేం..



అంగర పంట పొలాల్లో గడ్డి నుంచి ఎగసి పడుతున్న పొగ

కపిలేశ్వరపురం: పొలాల్లోని గడ్డికి మంట పెట్టవద్దని అధికారులు అవగాహన కల్పిస్తున్నా మండలంలోని పలు గ్రామాల రైతులు వినడం లేదు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి తదితర గ్రామాల్లోని ఆయకట్టు రైతులు తమ పొలాల్లోని గడ్డికి నిప్పు పెడుతున్నారు. కొంతమేర దమ్ము పనులు జరుగుతుండగా మిగిలిన ఆయకట్టు రైతులు దమ్ము చేసే ప్రక్రియలో భాగంగా గడ్డిని తగలబెడుతున్నారు. రెండు రోజులుగా గాలి అధికంగా వీస్తుండడంతో గడ్డి మంట నలు దిక్కులకు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. రైతులు అవగాహనతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారులపై పొగ... ప్రయాణికుల కళ్లలో సెగ



గొల్లపాలెంలో రోడ్డు పక్కన నిప్పుపెట్టిన చెత్తకుప్పల నుంచి వెలువడుతున్న పొగ

కాజులూరు: రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్పలు వెలిగిస్తూ కొందరు వ్యక్తులు చేస్తున్న అనాలోచిత చర్యల వల్ల గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాజులూరు మండల గ్రామాల్లో ప్రస్తుతం రైతులు పొలాల్లో తొలకరి మాసూళ్లు పూర్తి చేసుకుని దాళ్వా దమ్ములు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా పొలాల్లో ఉన్న చెత్తా, చెదారం, కలుపుమొక్కల అవశేషాలను కొందరు రైతులు రోడ్డుపైకి తెచ్చి పోగులుపెట్టి నిప్పంటిస్తున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుని రోడ్డు అంతా అలుముకుంటుంది. ఫలితంగా రహదారిపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు పొగ చిమ్మే ప్రాంతంలో ఒకదానికొకటి కనిపించక 'ఢీ' కొని ప్రమాదాల పాలవుతున్నాయి. కళ్లలోకి పొగ వెళ్లి విపరీతమైన మంట వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకుని పొలాల్లోన్ని చెత్త వెలిగించే రైతులు రహదారులకు దూరంగా పొలాల మధ్యలో వెలిగించుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైతుల్లో అవగాహన తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలని ప్రయాణికులు అంటున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



కరపత్రాలతో అవగాహన చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అందరూ అవగాహన కలిగి హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ హెచ్‌ఐవీపై విస్తృత ప్రచారంలో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హెచ్‌ఐవీ ఎయిడ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ఐఈసీ స్టాల్ ద్వారా కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భరతలక్ష్మి మాట్లాడుతూ ఎవరైనా హెచ్‌ఐవీ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆలోచన కలిగి ఉంటే వారికి ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. హెచ్‌ఐవీ సోకినట్లు అయితే ఉచిత మందులు జీవితకాలం అందించే విధంగా అమలాపురం, రామచంద్రపురం ఏరియా హాస్పిటల్‌లో పూర్తి ఉచిత మందులు జీవితకాలం అందించబడుతుందన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పసలపూడి సదస్సుకు 28 అర్జీలు



పసలపూడి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు ఐపీ శెట్టి



నల్లూరు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

రాయవరం: మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఐ.పి.శెట్టి పిలుపునిచ్చారు. మండలంలోని పసలపూడిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో భూ సంబంధ సమస్యలకు అర్జీలు స్వీకరించి, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. పసలపూడిలో నిర్వహించిన సదస్సులో 28 మంది రైతులు పాల్గొనా, ఏడుగురు సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేశారు.

నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో..

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ చిన్నారావు పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సుల్లో భూ యాజమానుల నుంచి భూ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ దరఖాస్తులు స్వీకరించారు. వెదురుమూడిలో సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల్లో రెవెన్యూ రికార్డులపై అవగాహన కల్పించారు. వెదురుమూడిలో భూముల నిర్వహణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధించాలి



రాయవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధుల గ్రూపు ఫొటో



కె. గంగవరంలో..

- ఎంపీపీ నౌడు వెంకటరమణ
- ముగిసిన రెండు రోజుల ఎల్ఎస్‌డీజీ శిక్షణ

రాయవరం: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు కృషి చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎల్ఎస్‌డీజీ శిక్షణ పూర్తి చేశారు. గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం వివిధ శిక్షణలు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కీర్తిస్పందన మాట్లాడుతూ రెండు రోజులు తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గ్రూపు ఫొటో దిగారు. సమావేశంలో సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, వాసంశెట్టి వెంకట్రావు, కత్తుల సీతామహాలక్ష్మి, చాట్రాతి జానకిరాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మండపేట శిక్షణ తరగతుల్లో మాట్లాతున్న ఈవోపీఆర్డీ శ్రీనివాస్

మండపేట: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ వన్, టూ, సిక్స్ ఉద్యోగులతో పాటు మండలస్థాయి అధికారులకు రెండు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో కె. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను వివరించారు. సుస్థిర అభివృద్ధి, స్థిరమైన లక్ష్యాల సాధన దిశగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 12 పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సూపరింటెండెంట్ వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం శిక్షణ తరగతిలో చర్చిస్తున్న అధికారులు

ముందస్తు ప్రణాళికలతోనే అభివృద్ధి సాధ్యం

కె.గంగవరం: ముందస్తు ప్రణాళికలతోనే పంచాయతీ అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి ముందుగానే పంచాయతీ అభివృద్ధి కోసం ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సిద్ధం చేసుకున్న ప్రణాళికలను తప్పకుండా అమలు చేసి పంచాయితీలను అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. తొలుత పలు శాఖలకు సంబంధించిన అభివృద్ధి లక్ష్యాలను అనుభవం కలిగిన కార్యదర్శులు శిక్షణ ఇచ్చారు. సాయంత్రం శిక్షణ తరగతులకు వచ్చిన సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కపిలేశ్వరపురం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళ, బుధవారాల్లో ఎల్ఎస్‌డీజీ సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకై 19 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. పలు అంశాలపై మండల పరిషత్ కార్యాలయ ఏఓ జి.రాజేంద్ర ప్రసాద్, ఈఓ పీఆర్‌డీ మోహన్‌లు చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కృషి అభినందనీయం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళిని సత్కరిస్తున్న పలువురు నేతలు

రామచంద్రపురం: జిల్లా సెషన్స్ కోర్టు ఏర్పాటులో రామచంద్రపురం బార్ అసోసియేషన్ కృషి అభినందనీయమని బార్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పిల్లి మురళి జిల్లా కోర్టు బెంచ్‌ను సాధించి గత 30 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారానికి పాటుపడ్డారని పలువురు వక్తలు అభినందించారు. స్థానిక బీవీఆర్ కల్యాణ మండపంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళిని పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. శెట్టిబలిజ సంఘం నాయకులు కట్టా సూర్యనారాయణ, వాసంశెట్టి శ్యాం, మేడిశెట్టి శేషారావు, కంచి సత్యానందం, కడలి రామకృష్ణ తదితరు పాల్గొని మురళీని దుశ్శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ రామచంద్రపురానికి జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా 8 మండలాల ప్రజలకు, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం అయిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళి ఉన్న సమయంలో ఈ కోర్టు బెంచ్‌ను సాధించడం ద్వారా బార్ అసోసియేషన్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని కొనియాడారు. పలు పార్టీలకు చెందిన నేతలు, శెట్టి బలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆధార్ వివరాలు నవీకరించే లక్ష్యంతో బుధవారం పలు గ్రామాల్లో ప్రత్యేక నవీకరణ కేంద్రాలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో కోరుమిల్లి, వడ్లమూరు సచివాలయాల్లో చిన్నారుల వివరాలను ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రల ఆధార్ వివరాలను నవీకరించారు. కేదారిలంక, నేలటూరు గ్రామాల సచివాలయాల్లో గురువారం ఈ శిబిరాలను నిర్వహించనున్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

కొత్తపేట: పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం తెలిపారు. రావులపాలెం మండలం కొమరాజులంకకి చెందిన దాసరి నాగబాబు వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో అతని అరెస్ట్ చేసి రాజోలు మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

ముగిసిన శిక్షణ కార్యక్రమం



శిక్షణ ముగింపు కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయాల్లో రెండు బ్యాచ్‌లుగా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరణ చేయడం అనే అంశంపై మండలంలోని 25 పంచాయతీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, మాస్టర్ ట్రైనర్స్ వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, పి.సుందర్ లాల్, పెట్టా సత్యనారాయణ, శివరాం, ఎం.కల్యాణిలు శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.